క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం జరిపారు. విశేష పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు

సింహాచలం: సింహగిరిపై పగల్‌పత్తు ఉత్సవాలు రెండవరోజు గురువారం శాస్త్రోక్తంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేసి ఉదయం ఆలయ బేడామండపంలో అయ్యవారి సేవ విశేషంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ఆస్థానమండపంలో కొలువుంచారు. దివ్య ప్రబంధ పారాయణాలు చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు, అర్చకులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో దామోదరం సంజీవయ్య 104వ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మదాసు, సీనియర్ అధ్యాపకులు ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ దయానంద మూర్తిలతో కలిసి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన గొర్లె రామునాయుడు

పెందుర్తి: జీవీఎంసీ 96వ వార్డు ప్రాంతానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. పెందుర్తిలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ పరిధిలో పార్టీని పటిష్టం చేసేందుకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రీ నమోదు గడువు 25



సీహెచ్ చంద్రావతి, మండల వ్యవసాయాధికారి

పరవాడ: వ్యవసాయ శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను పొందేందుకు ప్రతి రైతు తమ పేర్లను రైతు రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి పిలుపునిచ్చారు. 19వ విడత పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందేందుకు రైతులు విధిగా తమ పేర్లను రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, ఉద్యానవన శాఖ సహాయకుల ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. రైతులు తమ ఆధార్, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చన్నారు. పీఎం కిసాన్, పంటల బీమా, రైతు భరోసా తదితర పథకాలకు ఈ రిజిస్ట్రీ ఉపయోగపడుతుందన్నారు. ఈ నెల 25లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

శివాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న గొర్లి కుమార్, తదితరులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సబ్బవరం శివారు గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన గొర్లి కుమార్ శుక్రవారం రూ.50,116 విరాళమిచ్చారు. ఈ మొత్తాన్ని నిర్మాణంలో ఉన్న ఆలయం వద్ద కమిటీ సభ్యులకు అందించారు. విరాళం అందించిన కుమార్‌కు కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరరావు, బర్ల రమణ, గొంప సత్యనారాయణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం.. మనమెంత భద్రం

వేసవి కాలంలో తరచుగా ఏదో ఓ చోట అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు, గ్యాస్ సిలిండర్ పేలి కాలి బూడిదైన సామగ్రి, తాగి పారేసిన సిగరెట్, బీడీల కారణంగా అంటుకున్న మంటలు.. ఇలా వార్తలు కనిపిస్తూనే ఉంటాయి. కారణం ఏదైనా వేసవి వచ్చిదంటే చాలు.. అగ్ని ప్రమాదాల బారినపడి విలువైన ఆస్తులతోపాటు, కలలూ తగలబడి పోయే పరిస్థితి. ఈ వేసవిలో సబ్బవరం, పెందుర్తి పరిధిలో భారీ అగ్నిప్రమాదాలు సంభవిస్తే.. నియంత్రణ ప్రశ్నార్థకమే..! ఇక్కడ ఉన్నది ఒకే కేంద్రం.. ఒక్కటే వాహనం.







సబ్బవరం ఫైర్ స్టేషన్ ఇదే..

- సబ్బవరం, పెందుర్తికి ఒకే అగ్నిమాపక కేంద్రం
- ఒకటే వాహనం.. వేధిస్తున్న సిబ్బంది కొరత
- భారీ అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అంతే సంగతులు
- ఒకేసారి రెండు ప్రమాదాలు జరిగితే విశాఖ నగరం, చోడవరం నుంచి రావాల్సిందే..!

సబ్బవరం:

స్థానిక అగ్నిమాపక కేంద్రం(ఫైర్ స్టేషన్) పరిధిలో సబ్బవరం, పెందుర్తి మండలాలున్నాయి. పెందుర్తిలోని గొరపల్లిలో గడ్డి వాములకు గురువారం మంటలు అంటుకుని, వేసవి అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్న హెచ్చరికలు జారీ చేశాయి. స్థానికులు కాస్త అప్రమత్తంగా ఉండటం, అగ్నిమాపక సిబ్బంది కూడా సమయానికి చేరుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దగ్గర్లో ఉన్న పశువుల పాకలకు అగ్నికీలలు అంటుకుంటే ప్రమాద తీవ్రత మరింత పెరిగేది. ఇక్కడి ఫైర్ ఇంజిన్‌కు అవసరమయ్యే నీటిని నింపాలన్నా.. రైవాడ కాలువ/ పెందుర్తిలోని జీవీఎంసీ నీటి సరఫరా వ్యవస్థను ఆశ్రయించాల్సిందే..!

వేధిస్తున్న సిబ్బంది కొరత

సబ్బవరం అగ్నిమాపక కేంద్రంలో ఒక ఫైర్ అఫీసర్, ముగ్గురు లీడింగ్ ఫైర్ మెన్‌లు, 9 మంది ఫైర్‌మెన్‌లు, ముగ్గురు డ్రైవర్లు ఉండాలి. డ్రైవర్‌లు ఇద్దరే ఉన్నారు. ప్రత్యామ్నాయంగా ఓ హోమ్‌గార్డును డ్రైవర్ విధులకు తీసుకున్నారు. అగ్నిమాపక విధుల్లో శిక్షణ పొందిన ఫైర్‌మన్లు 9 మందికిగాను ముగ్గురు మాత్రమే ఉన్నారు. నలుగురు హోమ్‌గార్డుల్ని ఈ విధులకు తీసుకున్నారు. అయినా అత్యవసర సమయంలో సిబ్బంది కొరత వేధిస్తూనే ఉంది. ఉన్నది ఒకటే వాహనం కావడంతో.. ఒకేసారి రెండు చోట్ల ప్రమాదం సంభవిస్తే చోడవరం నుంచి వాహనాన్ని రప్పించాల్సిందే. ఈలోగా ఆస్తులు, ప్రాణాలకు దేవుడిపైనే భారం.



ఫైర్ స్టేషన్‌లోని ఫైర్ ఇంజన్



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది(ఫైల్)

నాలుగేళ్లలో 232 ప్రమాదాలు

సబ్బవరం ఫైర్ స్టేషన్ పరిధిలో గత నాలుగేళ్లలో 232 అగ్ని ప్రమాదాలు సంభవించాయి. వీటిలో రూ.2 లక్షల్లోపు నష్టం వాటిల్లిన చిన్న ప్రమాదాలే ఎక్కువ. రూ..2 లక్షల నుంచి రూ.10 లక్షల్లోపు నష్టం కలిగించిన వాటిని మీడియం ప్రమాదాలుగా, రూ.10 లక్షలకు మించి నష్టం వాటిల్లిన ప్రమాదాలను సీరియస్(తీవ్ర) ప్రమాదాలుగా పేర్కొంటారు. నాలుగేళ్లలో చిన్న ప్రమాదాలే ఎక్కువగా ఉన్నాయి.

నిబంధనలేం చెప్తున్నాయ్

నిబంధనల మేరకు బహుళ అంతస్తులు, విద్య, వాణిజ్య సంస్థలు, స్క్రాప్ దుకాణాలు, షాపులు, షా మిల్లుల్లో అగ్నిమాపక పరికరాల ఏర్పాటు తప్పనిసరి. ఇందు కోసం ప్రత్యేకంగా ఎల్లప్పుడూ నీటితో ఉన్న వాటర్ ట్యాంకులు, మోటార్లు ఉండాలి. ఈ నిబంధనలు అమలవుతున్నాయా? లేదా? అన్నది ఎప్పటికప్పుడు అగ్నిమాపక సిబ్బంది పర్యవేక్షణ చేయాలి. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రమాదాలు జరిగినపుడు ప్రజలది ఎంత తప్పు ఉందో.. అగ్నిమాపక సిబ్బంది నిర్లిప్త వైఖరి కూడా అంతే ఉంటోంది. ప్రజల్లో ప్రమాదాల పట్ల అవగాహన పెంచడంలో సిబ్బంది వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

నాలుగేళ్లలో అగ్నిప్రమాదాలు

సంవత్సరం	తీవ్రం	మధ్యస్థం	చిన్నవి	ఆస్తి నష్టం (రూ.లక్షల్లో)	ఆస్తి సంరక్షణ (రూ.కోట్లలో)
2021-22	0	0	50	18.53	1.71
2022-23	1	0	48	64.62	1.26
2023-24	0	3	67	54.55	1.98
2024-25	0	0	52	34.00	11.14

వేసవిలో అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలు

- వేసవి ఆకురాల్చు కాలం కావడంతో అటవీ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువ.
- రైతులు యూకలిప్టస్, సరుగుడు వంటి తోటల సమీపంలో జాగ్రత్తగా ఉండాలి.
- సిగరెట్, బీడీ, చుట్టలు తాగి, దాని నిప్పును పూర్తిగా ఆపేయకుండా పారేయడం సరికాదు.
- తోటలలో ఫైర్ గ్యాప్స్ తప్పనిసరి. చెత్త, ఆకుల మధ్య గ్యాప్, గుంతలు ఏర్పాటు చేసుకోవడం మంటలు వ్యాపించకుండా నియంత్రించవచ్చు.
- ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటప్పుడు గ్యాస్ స్టవ్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయడం మర్చిపోరాదు.
- వంట గదిలోకి తగిన వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలి.
- వేసవిలో ఏసీలను నిరంతరం ఆన్‌లో ఉంచకుండా.. అప్పుడప్పుడూ ఆఫ్ చేసుకోవడం ద్వారా ఎలక్ట్రిక్ ప్రమాదాలను నియంత్రించవచ్చు.

అప్రమత్తంగా ఉండాలి



వేసవి మొదలవడంతో అగ్నిప్రమాదాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. స్క్రాప్ దుకాణాలు, సా మిల్లులు, వాణిజ్య సముదాయాల యజమానులు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలి. టోల్ ఫ్రీ నెంబర్ 101తోపాటు, 0892-4248799, 99637 29473 నంబర్లలో సంప్రదించవచ్చు. ఎంత వేగంగా మాకు సమాచారం అందిస్తే.. అంత వేగంగా స్పందించి, అంత ఎక్కువగా నష్ట నివారణ సాధ్యమవుతుంది.

– డి సత్యరాజు, ఫైర్ ఆఫీసర్, సబ్బవరం ఫైర్ స్టేషన్

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న గండి బాబ్జి



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పురుషోత్తపురంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, తీర్థమహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. సాముగరిడీలు, కోలాటాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిపారు. దాదాపు 6 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేణుగోపాలస్వామిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ నేత గండి రవికుమార్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు చందుయాదవ్, సీర అప్పలరాజు, పిల్లల శ్రీను, ఆబోతు శ్రీను, ఆబోతు రమణ, కోటిబాని శ్రీను, లక్కీ గోవింద్, పిల్లల అప్పలరాజు, యలమంచిలి కనకరాజు, కోరాడ అమ్మతల్లి, పిల్లల అప్పలనాయుడు, బొమ్మిడి సత్తి, వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు.

మామిడి, జీడిమామిడిపై తేనె మంచు ప్రభావం

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు



వంగలిలో రైతులకు సూచనలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి ప్రభాకరరావు

సబ్బవరం: కొన్ని రోజులుగా కురుస్తున్న తేనె మంచు మామిడి, జీడి మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని వంగలి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మామిడి, జీడి మామిడి తోటలను సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. తేనె మంచును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు థయోమిథాక్సమ్ 4 గ్రాములు/ పిప్రోనికల్ 20 ఎంఎల్/ ఇమిడోక్లోప్రిడ్ 4 ఎంఎల్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బూడిద తెగులు ఆశిస్తే హెక్సాకొనజోల్ 20 ఎంఎల్ 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. బంక తెగులు రాకుండా ట్రైకోడెర్మా పాడిని భూమిలో వేసి, పిందెలు బఠానీ సైజులో ఉన్నప్పుడు ప్లానోఫిక్స్ 2 ఎంఎల్‌ను 10 లీటర్ల నీటికి చేర్చి, చల్లాలన్నారు. స్థానిక ఉద్యాన సిబ్బంది సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఉద్యాన అధికారి ఆర్.కిరణ్మయి, వీహెచ్‌ఏ పి.ప్రభావతి, రైతులు కోట్ని అమ్మతల్లినాయుడు, జెట్టి సోమునాయుడు తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఆన్‌లైన్ గేమ్‌లు అత్యంత ప్రమాదకరం
- పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: ఆధునిక పోకడల పేరుతో యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలమని సూచించారు. చింతలగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్లకు బానిసలవుతున్నారని.. అది మంచి పరిణామం కాదన్నారు. పబ్జీ, ఇతర ఆన్‌లైన్ గేమ్‌ల వలన అనేక అనర్థాలు ఎదురవుతాయన్నారు. ఆడపిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే జీవితాంతం జైల్లో ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అక్రమంగా తవ్విన చెరువును పూడ్చాలని ఆందోళన



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పరవాడ: ఫార్మా వ్యర్థజలాలను నిల్వ చేయడానికి తానాం వద్ద ప్రైవేట్ స్థలంలో అక్రమంగా తవ్విన చెరువును తక్షణమే మూసివేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తానాం గ్రామ సచివాలయం వద్ద రైతులతో కలిసి శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా వ్యర్థ రసాయనాలను నిల్వ చేసేందుకు తవ్విన చెరువుపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చెరువును వెంటనే మూసివేయాలని రాష్ట్ర పీసీబీ అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఫార్మా వ్యర్థాలతో పూడ్చివేస్తున్న వర్రి వారి చెరువుకు ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫార్మా యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో వర్రి సన్యాసినాయుడు, కన్నంనాయుడు, వెంకునాయుడు, సన్యాసమ్మ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తుంటే.. కూటమి నేతలకు కోపమొచ్చింది



కార్మికనగర్‌లో ఆక్రమణలను తొలగించేందుకు వెళ్ల కూటమి నాయకుల బెదిరింపులతో ఏం చేయాలో పాలుపోక ఆగిన అధికారులు



చీమలాపల్లిలో షెడ్ తొలగించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్న నేతల అనుచరులు



కార్మికనగర్‌లో షెడ్‌ను వదిలి పాకల్ని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

- ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన అధికారులు
- ప్రజాప్రతినిధుల ఒత్తిడితో తూతూ మంత్రపు చర్యలు
- తొలగింపుల్ని అడ్డుకున్న కూటమి 'ముఖ్యనేతలు'

పెందుర్తి: ఒకటి ఆక్రమణ నిషేధిత వాటర్‌బాడీ అయిన చెరువు.. మరొకటి ప్రభుత్వ భూమి.. వాటిలో ఇష్టానుసారంగా కూటమి నాయకులు స్థలాలను ఆక్రమించి అమ్మకాలు జరుపుతున్నారు. ఆ దురాక్రమణ పర్వాన్ని అడ్డుకునేందుకు అధికారులు కదిలారు. కానీ వారికి 'కూటమి ముఖ్యనేతలు'బంధనాలు వేశారు. ఆ ఆక్రమణలను తొలగిస్తే మీ సంగతి చూస్తామంటూ.. అధికారులనే అడ్డుకున్నారు.

కదిలి.. వెనక్కి మళ్లిన యంత్రాంగం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పెందుర్తి పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగిపోయాయి. చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాల్లో కూటమి నాయకులు కబ్జాలకు పాల్పడుతూ.. ఆయా స్థలాలను పేద, మధ్య తరగతి కుటుంబాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై 'పాక వెయ్..అమ్మేసెయ్' శీర్షికన సాక్షి కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దివ్య బృందం ఆక్రమణల తొలగింపునకు వెళ్లింది. కార్మికనగర్‌లో అక్రమంగా వేసిన పాకలను తొలగించారు. అయితే మిగిలిన చోట కొందరు ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయడంతో వెనుదిరిగినట్లు తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చాయి.

కంచే చేను మేస్తే..

పెందుర్తి పట్టణ ప్రాంతంలో చెరువులు, ప్రభుత్వ భూములను 'కంచే చేను మేస్తున్న' చందంగా కూటమి నాయకులే మింగేస్తున్నారు. కబ్జాదారుల ఆక్రమణలను తొలగించేందుకు వెళుతున్న అధికారులను బెదిరిస్తూ భూ కబ్జాదారులకు ఇతోధికంగా సాయపడుతూ, తమ నైజాన్ని చాటుకుంటున్నారు. శుక్రవారం ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన అధికారులకు చుక్కెదురైంది. చినముషిడివాడ కార్మికనగర్, చీమలాపల్లిలోని చెరువు, ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులను కూటమి నాయకులు అడ్డుకున్నారు. ముఖ్యంగా స్థానిక జనసేన, టీడీపీ నాయకులు వారి ముఖ్య నేతలతో ఫోన్లు చేయించి మరీ, తొలగింపుల్ని నిలిపేయించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షకులుగా పదే పదే చెప్పుకునే ప్రజాప్రతినిధులే ప్రభుత్వ భూముల ఆక్రమణలను ప్రోత్సహిస్తుంటే చేసేదేం లేక రెవెన్యూ అధికారులు దిగాలుగా వెనుదిరిగాల్సి వచ్చింది.

నేడు ధ్వజస్తంభం ప్రతిష్ట



సప్తాహంలో పాల్గొన్న గండి రవికుమార్

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో హరే రామ హరే కృష్ణ దివ్యనామ సప్తాహం శుక్రవారం కొనసాగింది. సప్తాహంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గండి రవికుమార్, పార్టీ స్థానిక నాయకులు రాపేటి రాము, దాడి కన్నంనాయుడు, యడ్ల నాయుడు, గురి శ్రీనివాస్, కరక రాము పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



స్పోర్ట్స్ మీట్‌లో పిరమిడ్ ఆకృతిలో విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అంతర్జాతీయ యోగ, పవర్ లిఫ్టింగ్ స్వర్ణ పతక విజేత, హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి అన్నారు. స్థానిక భాష్యం పాఠశాలలో భాష్యం ఇంట్రా స్పోర్ట్స్ మీట్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక విద్యా విధానంలో పిల్లలు ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. పిల్లలు మానసిక ఒత్తిడిని అధిగమించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. విద్యార్థి స్థాయి నుంచే క్రమం తప్పకుండా పిల్లలను ఆటల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు కేవలం చదువులోనే కాకుండా ఆటపాటలపై కూడా ఆసక్తి చూపేందుకు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు కరాటే, డ్రిల్, బైక్ స్టంట్‌లు చేసి అలరించారు. భాష్యం జెడ్‌ఈవో వెంకట్, ప్రిన్సిపాల్ జి.వి.దీపిక, హెచ్‌ఎం టిన్నీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవాలకు శ్రీకారం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రామ్మోహనరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీ సీతారామాలయ 22వ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు విష్వక్సేనుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఎ.రామ్మోహనరావు జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను ప్రారంభించారు. అనంతరం హనుమత్ పతాకావిష్కరణ, రుత్విక్ వరణం, యాగశాల ప్రవేశ కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిరంజీవిరావు, సింహపురికాలనీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 9.30 గంటలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ, రాత్రి 7 గంటల నుంచి సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.